# హ్యాండిల్ లాక్ వేయడం మరిచారో... మీ వాహనం మాయం..






వరంగల్ పోలీస్ కమిషనరేట్ తో పాటు రాచకొండ, సైబరాబాద్ కమిషనరేట్ల పరిధిలో తాళం వేయని ద్విచక్రవాహనాలను చోరీలకు పాల్పడుతున్న ముగ్గురు దొంగలను టాస్క్ ఫోర్స్ మరియు స్టేషన్ ఘన్‌పూర్ పోలీసులు సంయుక్తం కల్సి అరెస్ట్ చేసారు. వీరి నుండి 12 లక్షల రూపాయల విలువగల 12 ద్విచక్ర వాహనాలు మూడు సెల్ ఫోన్లు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

ఈ అరెస్ట్ కు సంబంధించి వరంగల్ పోలీస్ కమిషనర్ డా.తరుణ్ జోషి వివరాలను వెల్లడిస్తూ పోలీసులు అరెస్ట్ చేసిన వరంగల్ జిల్లా వర్ధన్నపేటకు చెందిన ఉడట హరీష్, వరంగల్ జిల్లా, రాయపర్తికి చెందిన వొల్లెల సుధాకర్ (వికలాంగుడు) మరియు బొమ్మెర కిరణ్ ముగ్గురు ఒకే ప్రాంతానికి చెందిన వారు కావడంతో వీరి మధ్య స్నేహం కుదిరింది వీరు చేసే పనుల ద్వారా వచ్చే ఆదాయం వీరి జల్సాలకు సరిపోకపోవడంతో నిందితులు ముగ్గురు ద్విచక్ర వాహనాల చోరీల పాల్పడి వాటిని అమ్మగా వచ్చిన డబ్బుతో జల్సాలు చేసేందుకు సిద్ధపడ్డారు. ఇందులో భాగంగా నిందితులు గత సెప్టెంబర్ మాసంలో ఘనపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో నాలుగు, పాలకుర్తి, మాదాపూర్ పోలీస్ స్టేషన్ల పరిధిలో రెండు ,సుబేదారి, జిఆర్ పి కాజీపేట భువనగిరి పోలీస్ స్టేషన్ల పరిధిలో ఒకటి చోప్పున ద్విచక్ర వాహనాలను నిందితుడు హరీష్ చోరీ చేసేవాడు. మిగితా ఇద్దరు నిందితులు కిరణ్, వికలాంగుడైన సుధాకర్ ఇరువురు దొంగలించిన వాహనాలను తమ దగ్గర వుంచుకోని వాటి అమ్మకానికి పెట్టేవారు. నిందితులందరు ద్విచక్ర వాహనాలు అమ్మగా వచ్చిన డబ్బుతో జల్సాలు చేసేవారు. నిందితుడు హరీష్ గత సంవత్సరం స్టేషన్ ఘన్‌పూర్ ప్రాంతంలో ఒక ద్విచక్ర వాహనాన్ని చోరీ చేయడంతో పాటు ద్విచక్ర వాహనం చోరీ కేసులో నిందితుడు హరీష్ ను ములుగు పోలీసులు అరెస్ట్ చేసి జైలుకు తరలించారు. ఈ చోరీలపై ప్రత్యేక దృష్టి సారించడంతో పాటు పోలీసులకు అందుబాటులో వున్న టెక్నాలజీని వినియోగించుకోని నిందితులను గుర్తించడం జరిగింది. ఈ రోజు ఉదయం పోలీసులు స్టేషన్ ఘన్ పూర్ పట్టణ శివారు

ప్రాంతంలో తనిఖీలు నిర్వహిస్తుండగా నిందితుల్లో ఒకడైన హరీష్ చోరీ చేసిన ద్విచక్రవాహనంపై వస్తుండగా వాహనానికి నంబర్ లేకపోవడం అనుమానంతో పోలీసులు నిందితుడి అపి విచారించగా నిందితుడు పాల్పడిన ద్విచక్రవాహనాల చోరీలను అంగీకరించాడు. నిందితుడు ఇచ్చిన సమాచారంతో మిగితా నిందితులను అరెస్ట్ చేయడం తో పాటు వారి ఇండ్లల్లో భద్రపర్చిన ద్విచక్రవాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. టాస్క్ ఫోర్స్ అదనపు డిసిపి వైభవ్ గైక్వాడ్,టాస్క్ ఫోర్స్ ఏసిపి జితేందర్ రెడ్డి,టాస్క్ ఫోర్స్ ఇన్ స్పెక్టర్లు నరేష్ కుమార్, వెంకటేశ్వర్లు, ఎస్.ఐ లవణ్ కుమార్, పాలకుర్తి ఎస్.ఐ శ్రీకాంత్, ఏఏఓ సల్మాన్ పాషా, హెడ్ కానిస్టేబుల్ శ్యాంసుందర్, అశోక్, స్వర్ణలత, కానిస్టేబుళ్ళు నవీన్, సృజన్, సురేష్, శ్యాం, శ్రీధర్, శ్రీను,శ్రవణ్ కుమార్, నాగరాజులను పోలీస్ కమిషనర్ అభినందించారు.

**ద్విచక్ర వాహనాలకు హ్యాండిల్ లాక్ వేయడం మరువద్దు**

-వరంగల్ పోలీస్ కమిషనర్ డా. తరుణ్ జోషి

హ్యాండిల్ లాక్ వేయని ద్విచక్ర వాహనాల చోరీలకు పాల్పడుతున్న నిందితులు అరెస్ట్ కావడంతో వరంగల్ పోలీస్ కమిషనర్ ద్విచక్ర వాహనదారులను అప్రమత్తం చేసారు. ఇందులో భాగంగా ద్విచక్ర వాహనాన్ని పార్కింగ్ చేసే సమయంలో వాహనదారుడు తప్పనిసరిగా హ్యాండిల్ లాక్ వేయడం మర్చిపోవద్దని పోలీస్ కమిషనర్ వాహనదారులకు సూచించారు.